క్లుప్తంగా

నేడు ఆర్టీసీ డిపోలో వైద్యశిబిరం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ వారి సహకారంతో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ అమర్నాథ్ ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అంది స్తారని తెలిపారు. సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థం క్షేత్రంలో సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు ఆదివారం తెలిపారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరూపాక్షి హాజరు కానున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కబడ్డీలో ప్రతిభ



ట్రోఫీ అందుకున్న కైరుప్పల మహిళల జట్టు

ఆస్పరి: 'ఆడుదాం- ఆంధ్ర ఆటల పోటీలలో భాగంగా జిల్లాస్థాయి మహిళల కబడ్డీ పోటీల్లో మండలంలోని కైరుప్పల గ్రామానికి చెందిన కబడ్డీ జట్టు తృతీయ స్థానం సాధించినట్లు పీడీ రామాంజనేయులు ఆదివారం తెలిపారు. విజయం సాధించిన మహిళా జట్టును సర్పంచ్ తిమ్మక్క, గ్రామస్తులు అభినందించారు.

పన్నులు సకాలంలో చెల్లించండి

చిప్పగిరి: పన్నులు సకాలంలో చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఈఓపీ ఆర్డీ బాలన్న ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ఇంటి పన్నులు, కుళాయి, ట్రేడ్ లైసెన్సు తదితర పన్నులు చెల్లించాలని కోరారు. ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో పన్నుల చెల్లింపుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న ఉపాధ్యాయులు, తోటి స్నేహితులు

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు హైస్కూల్‌లో 2002-03 సంవత్సరంలో పదో తరగతి చదివిన గ్రామానికి చెందిన లాలప్ప (38) గుండెపోటుతో మరణించడంతో అతని స్నేహితులు స్పందించారు. చేయిచేయి కలిపి కొంత నగదు సమకూర్చారు. నాటి ఉపాధ్యాయులు సైతం తోడై ఆదివారం లాలప్ప అంత్యక్రియలకు హాజరై, నివాళులర్పించారు. బాధిత కుటుంబీకులకు ప్రగాఢ సంతాపం తెలుపుతూ రూ.30 వేల నగదు సాయం అందించారు. హెచ్‌ఎంలు వెంకటసుబ్బారెడ్డి, శివశంకరయ్య, ఉపాధ్యాయులు బాల రంగారెడ్డి, బీవై సుబ్బారాయుడు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శరవేగంగా సచివాలయ భవన నిర్మాణం



రామదుర్గంలో నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయ భవనం

చిప్పగిరి: మండలంలోని రామదుర్గం గ్రామంలో రూ.38 లక్షలతో నిర్మిస్తున్న గ్రామ సచివాలయ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గతంలో పంచాయతీ భవనం ఒకే గదిలో సచివాలయ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటూ విధులు నిర్వహించేవారు. ప్రభుత్వం సకల సౌకర్యాలతో నూతన భవన నిర్మాణం చేపట్టింది. పనులు చివరి దశకు చేరుకోవడంతో సిబ్బంది, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

హొళగుంద: ఎల్లార్తి గ్రామంలో కర్ణాటక మద్యం విక్రేతను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు ఆదివారం విలేకరులకు తెలిపారు. సదరు వ్యక్తి కర్ణాటక నుంచి ఆంధ్రాకు అక్రమంగా మద్యం టెట్రా ప్యాకెట్లను తీసుకొచ్చి గ్రామంలో విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. అతని నుంచి 75 మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేదల సొంతింటి కల నేరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- గోనెగండ్లలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి
- రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపు



లబ్ధిదారు చాకలి లక్ష్మికి ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

గోనెగండ్ల: మండల కేంద్రంలో గత 30 ఏళ్లుగా రజకులు ఎదురుచూస్తున్న సొంతింటి కల సాకారమైందని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో రజకులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, ఎంపీపీ టీ.నసురుద్దీన్, తహసీల్దార్ వేణుగోపాల్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గోనెగండ్లలో రజకులకు 30 ఏళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే శేషారెడ్డి 60 ఇళ్ల పట్టాలను పంపిణీ చేయగా అనివార్య కారణాల వల్ల తర్వాత రద్దయ్యాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ స్థలాల సమస్యను పరిష్కరించి అర్హులైన 120 మందికి సెంటున్నర స్థలం చొప్పున పట్టాలు అందిస్తున్నట్లు తెలిపారు. పట్టా పొందిన వారు ఇళ్లు నిర్మించుకుంటే ప్రభుత్వం రూ.1.80 లక్షలు సాయం అందిస్తుందని చెప్పారు. అలాగే ప్రతిఒక్కరికీ సొంతిల్లు ఉండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. అన్ని గ్రామాల్లోని జగనన్న కాలనీలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుంటున్నారని చెప్పారు. అలాగే వైఎస్సార్‌సీపీ పాలనలో హంద్రీ-నీవా నుంచి జీడీపీలోకి 3 టీఎంసీల నీటిని తీసుకురావడం జరిగిందన్నారు. దీంతో తాగు, సాగునీటికి అవకాశం ఏర్పడిందన్నారు. ప్రాజెక్టును ఒక మీటరు ఎత్తు పెంచితే జీడీపీలో మరో టీఎంసీ నీటిని నిల్వచేసుకునేందుకు అవకాశం ఉంటుందని ఇందుకోసం రూ.57.3 కోట్లను మంజూరు చేసినట్లు వివరించారు. అలాగే మండలంలోని 14 గ్రామాలకు తాగునీటి సమస్య తీర్చేందుకు జేజేఎం కింద రూ.20 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. టెండర్ పనులు పూర్తవ్వగానే పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఇంటింటికీ కొళాయి ద్వారా తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. సింగిల్‌విండో అధ్యక్ష, ఉపాధ్యక్షులు తిరుమల రెడ్డి, భాస్కర్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు బందెనవాజ్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, కన్వీనర్ దొరబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ శివరాం, మద్దిలేటి, గోవింద్, నాయుడు, ఉమాదనంద రెడ్డి, మాబువలి, మనోహర్ రెడ్డి, ఉరుకుందు, నదిముల్లా తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్



హొళగుందలో లబ్ధిదారుల ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేస్తున్న అధికారులు

హొళగుంద: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన జగనన్న ఇళ్ల స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యక్రమం ఆయా సచివాలయాల్లో ఆదివారం సెలవు రోజు చురుగ్గా కొనసాగింది. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద ప్రభుత్వం హొళగుంద మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో దాదాపు 40 ఎకరాల్లో 1700 మంది పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసింది. లబ్ధిదారులకు పదేళ్ల తర్వాత ఇళ్లస్థలాలపై సర్వ హక్కులు కలిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఇళ్ల స్థలాలను ఆయా సచివాలయాలలో అధికారులు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. లబ్ధిదారులు సచివాలయాలకు తరలివచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. పదేళ్ల ఆ స్థలాలు సేల్ డీడ్‌లుగా మారి ప్రభుత్వ జోక్యం లేకుండా దానవిక్రయాలు జరుపుకునేందుకు అవకాశం ఉంటుంది.

మంచి జరిగింటేనే వైఎస్సార్‌సీపీకి ఓటేయండి



నాయకులు, కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.విరూపాక్షి

దేవనకొండ: వైఎస్ జగనన్న నాలుగున్నరేళ్ల పాలనలో ప్రతి ఇళ్లు, ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాల రూపంలో లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.విరూపాక్షి పేర్కొన్నారు. జగనన్న పాలనలో మంచి జరిగి ఉంటే మరోసారి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల నాయకులతో పరిచయ వేదికలో భాగంగా కార్యకర్తలతో సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి కార్యకర్త శాయశక్తులా కృషి చేయాలన్నారు. ప్రజలను ముంచే ప్రభుత్వం గాకుండా ప్రజలకు సంక్షేమ పథకాలను పంచే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని పిలుపునిచ్చారు. అలాగే తెర్నెకల్, నేలతలమరి, తువ్వదొడ్డి తదితర గ్రామాల నాయకులతో కలిసి పార్టీ వ్యూహంపై చర్చించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. నాయకులు తపాల శ్రీనివాసులు, మండల కన్వీనర్ మల్లికార్జున, నిజాల్‌రెడ్డి, రాజారెడ్డి, ప్రేమనాథ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

ఆలూరు: గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నాయకుడు విరూపాక్షి సూచించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి హాజరై జయప్రదం చేసిన కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ నెల 10వ అనంతపురం జిల్లాలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించే 'జగనన్న కోసం నేను సిద్ధం' సమావేశానికి అన్ని మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రైతుల ఆందోళన



విత్తన దుకాణం ముందు ఆందోళనకు దిగిన రైతులు

ఎమ్మిగనూరురూరల్: నకిలీ పుచ్చకాయ విత్తనాలు అంటగట్టడంతో పంట కాపు రాక మోసపోయామని ఆదివారం బాధిత రైతులు విత్తన దుకాణం ముందు ఆందోళనకు దిగారు. పెద్దకడబూరుకు చెందిన రైతులు దాసరి శ్రీనివాసులు, క్రాంతికుమార్ పట్టణంలో శ్రీ గణేష్ హైబ్రిడ్ సీడ్స్ దుకాణంలో పుచ్చకాయ విత్తనాలను కొనుగోలు చేసి పంట సాగు చేశారు. రెండు నెలలు కావస్తున్నా కాయలు పెద్దవిగా గాకపోవడంతో దుకాణ యజమానికి విషయం చెప్పగా ఆయన కంపెనీ వారికి చెబుతామంటూ కాలయాపన చేస్తుండటంతో ఆదివారం దుకాణం ఎదుట ధర్నాకు దిగారు. బాధిత రైతులకు పెద్దకడబూరుకు చెందిన రమాకాంత రెడ్డితో పాటు మరికొంత మంది మద్దతుగా నిలిచారు. తమకు న్యాయం చేసి నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై కేసులు నమోదు చేయాలని రైతులు కోరుతున్నారు.



సోగనూరు రోడ్డులోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సోగనూరు రోడ్డు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో 2001-2002 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ బ్యాచ్ విద్యార్థులందరూ తిరిగి కలుసుకుని నాటి మధుర స్మృతులను, జ్ఞాపకాలను నెమరేసుకొంటూ ఆనందంగా గడిపారు. మిత్రుల యోగక్షేమాలను తెలుసుకుంటూ సంతోషంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఎంఈఓ రాజరత్నం, జగదీష్, ఎన్‌సీసీ మాస్టర్ నాగన్న, లలిత కుమారి తదితరులను ఘనంగా సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



పుల్లాపురంలో బోరు వేయిస్తున్న సర్పంచ్ అరుణ్‌కుమార్

దేవనకొండ: పుల్లాపురం గ్రామ ప్రజల నీటి కష్టాలు తీరినట్లేనని సర్పంచ్ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని తెర్నెకల్ మజారా గ్రామమైన పుల్లాపురానికి గత 15 సంవత్సరాల నుంచి తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. గతంలో వేసిన బోర్లలో నీటిమట్టం తగ్గిందని, మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి సమస్యను తీసుకెళ్లి నాలుగు బోర్లు వేయించినా చుక్కనీరు పడలేదన్నారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలన్న దృఢ సంకల్పంతో గ్రామ పంచాయతీ నిధులతో ఆదివారం బోరు వేయగా ఇంచున్నర మేర నీరు పడ్డాయని చెప్పారు. బోరులో నీరు పుష్కలంగా పడడంతో పుల్లాపురం గ్రామ ప్రజల నీటి సమస్య తీరినట్లేనని ఆయన చెప్పారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో కార్డెన్ సెర్చ్



పెద్దతుంబళంలో అనుమానితులను విచారిస్తున్న సీఐ, ఎస్‌ఐ

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దతుంబళం, కుప్పగల్ గ్రామాల్లో ఆదివారం తెల్లవారుజామున ఆదోని రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేశారు. పెద్దతుంబళం గ్రామానికి చెందిన నరసయ్య, తిక్కయ్య ఇళ్లల్లో 102 ప్యాకెట్ల(90 ఎంఎల్) కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. ఎప్పటికప్పుడు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తామని చెప్పారు. అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేసి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్డెన్‌సెర్చ్‌లో ఎస్‌ఐలు పీరయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీలో చేర్చాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఆలూరు: వాల్మీకి రిజర్వేషన్లలో ప్రాంతీయ వ్యత్యాసాలను తొలగించి ఎస్టీ జాబితాలో చేర్చాలని దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణస్వామి కోరారు. ఈ మేరకు స్థానిక మంత్రి నివాసంలో.. ఈ నెల 8వ తేదీన ఆదోని మండలంలోని పెద్దతుంబళం గ్రామం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించ తలపెట్టిన పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను వాల్మీకి నాయకుడు ఎస్.పరమేష్ సమక్షంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కొన్ని జిల్లాల్లో వాల్మీకులు ఎస్టీలుగాను, రాయలసీమ జిల్లాలో బీసీలుగా కొనసాగుతున్నారన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చి ప్రాంతీయ రిజర్వేషన్ వ్యత్యాసాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం



హాలహర్విలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న గ్రామ సచివాలయం-1 భవనం

నందవరం: మండలంలో ప్రభుత్వ భవన నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. హాలహర్వి గ్రామంలో సచివాలయ భవనం నిర్మాణం దాదాపు పూర్తికాగా ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. మండలంలో 7 గ్రామ సచివాలయాలు, 6 ఆర్బీకేలు, 3 విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ల నిర్మాణ పనులను పంచాయతీరాజ్ అధికారులు వేగవంతం చేశారు. ప్రభుత్వం భవన నిర్మాణాలకు సంబంధించి బిల్లులు పూర్తిగా చెల్లించడంతో పనులు ఊపందుకున్నాయి. ఒక్కొక్క గ్రామ సచివాలయానికి రూ.40 లక్షలు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రానికి (ఆర్బీకే) రూ.21.80 లక్షలు, హెల్త్ క్లినిక్ సెంటర్లకు రూ.17.50 లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ నెలాఖరుకల్లా ప్రభుత్వ భవన నిర్మాణాలు పూర్తి చేస్తామని పీఆర్ అధికారులు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



కడ్లమాగి రస్తాలోని పొలాల్లో ఒరిగిపోయి ఉన్న విద్యుత్ స్తంభాలు

హొళగుంద: స్థానిక కడ్లమాగి రస్తాలోని పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఓ వైపు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని రైతులతో పాటు అటువైపు వెళ్లే వారు భయాందోళనకు గురౌతున్నారు. వర్షాకాలం సీజన్‌లో రైతులు పంటలు సాగు చేసే సమయంలో విద్యుత్ స్తంభాల దగ్గరకు వెళ్లేందుకు జంకుతుంటారు. పెద్దగా గాలి వీస్తే స్తంభాలు పడిపోయి ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని విద్యుత్ శాఖాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మాళ మల్లేశ్వరునికి ప్రత్యేక పూజలు



దేవరగట్టులో పూజలు నిర్వహిస్తున్న పూజారి

హొళగుంద: దసరా బన్ని ఉత్సవాలకు ప్రసిద్ధి చెందిన దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి విరాట్‌మూర్తులకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలో విరాట్‌మూర్తులకు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని దర్శించుకోవడానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం జరిగింది.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంతో మాధవరం ఎస్‌ఐ కిరణ్‌బాబు

మంత్రాలయం: మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన మైనుద్దీన్ కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు మాధవరం ఎస్‌ఐ కిరణ్ బాబు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మద్యం, నిందితుడి అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మాధవరం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా బైక్‌పై 5 బాక్సుల్లో తీసుకొస్తున్న 90ఎంఎల్ 480 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వగరూరు గ్రామానికి చెందిన మైనుద్దీన్‌పై కేసు నమోదు చేసి బైక్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో పోలీసులు వీరాంజినేయులు, భాస్కర్, సెబ్ హెచ్‌సీ షరీఫ్ పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశి ఘనంగా నిర్వహిద్దాం

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈనెల 20న జరుపుకోబోయే భీష్మ ఏకాదశి కార్యక్రమాలను విజయవంతం చేద్దామని గంగపుత్ర (బెస్త) సంఘం ప్రతినిధి అనకల బాలాజీ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గంగమ్మ గుడి ఆలయ ప్రాంగణంలో సంఘం మండల సమావేశం జరిగింది. మండలంలోని గంగపుత్రుల సమస్యలపై చర్చించారు. త్వరలో మండలంలోని అన్ని గ్రామాల గంగపుత్రులను కలుపుకుని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేలా తీర్మానించారు. సమావేశంలో కోదండ, రమేశ్, రమణాచలం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోండి

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు నాలుగు నెలలుగా గుడ్డును అందించకుండా మాయం చేసిన వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా, కృష్ణ డిమాండ్ చేశారు. ఆర్‌ఏవీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం బీసీ హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజనాన్ని పరిశీలించారు. గుడ్డు విషయంపై వార్డెన్ ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి బిల్లు రాలేదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ పంపిణీ



మిద్దెతండాలో సుగాలి సోమ్లమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లక్ష్మీదేవి



చాబాల గ్రామంలో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ దివాకర్

మద్దికెర: మండల కేంద్రానికి చెందిన నాగన్న అనే వృద్ధుడు అనారోగ్యంతో కర్నూలులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ శివకుమార్ ఆదివారం కర్నూలుకు వెళ్లి నాగన్నకు పింఛన్ అందజేశారు. వృద్ధులు అవస్థలు పడకుండా ప్రభుత్వం ప్రతి నెలా ఇంటివద్దకే పింఛన్ సొమ్ము అందిస్తోందని, ప్రస్తుతం నాగన్న అనారోగ్యంతో కర్నూలులోని ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటుండడంతో వలంటీర్ అక్కడికే వచ్చి పింఛన్ అందజేయడంపై కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సెలవు రోజూ పింఛన్ల పంపిణీ

తుగ్గలి: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం సెలవురోజు కొనసాగింది. ఆదివారం సాయంత్రానికి నియోజకవర్గంలో 97 శాతానికిపైగా పింఛన్లను వలంటీర్లు పంపిణీ చేశారు. పత్తికొండ మండలంలో 8,788 పింఛన్లకుగాను 8,599 మందికి (97.85 శాతం), వెల్దుర్తి మండలంలో 8,096 పింఛన్లకుగాను 7,921 (97.84 శాతం) మందికి, కృష్ణగిరిలో 4,943 పింఛన్లకు 4,835 (97.82 శాతం) మందికి, తుగ్గలిలో 7,831 పింఛన్లకుగాను 7,650 (97.69 శాతం) మందికి, మద్దికెర మండలంలో 4,896 పింఛన్లకు గాను 4,896(97.28 శాతం) మందికి పింఛన్ నగదు అందజేశారు.

అనంతపురం జిల్లాకు వెళ్లి పింఛన్ పంపిణీ

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన హెచ్.లాలెమ్మ అనారోగ్యంతో కూతురి గ్రామమైన అనంతపురం జిల్లా చాబాల గ్రామంలో ఉంటోంది. ఆమె నంచర్ల గ్రామానికి రాలేని స్థితిలో ఉండడంతో గ్రామ వలంటీర్ దివాకర్ ఆదివారం చాబాల గ్రామానికి వెళ్లి వృద్ధురాలి వేలిముద్రలు తీసుకొని పింఛన్ సొమ్ము అందించారు. వలంటీర్ సేవలపై వృద్ధురాలు, కుటుంబ సభ్యులు, కృతజ్ఞతలు తెలిపారు.

7న వైఎస్సార్‌సీపీ సమావేశం

హొళగుంద: స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈ నెల 7వ తేదీన పార్టీ కార్యకర్తలు, నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ షఫివుల్లా ఆదివారం తెలిపారు. సమావేశానికి పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, కర్నూలు మేయర్ బీవై రామయ్య, ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ తెర్నెకల్ సురేంద్రరెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. జెడ్పీవైస్ చైర్మన్, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు సిద్ధం పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం

దేవనకొండ: మండల కేంద్రంలోని సొసైటీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించే వైఎస్సార్‌సీపీ కార్యకర్తల విస్తృత సమావేశంలో 'ఎన్నికలకు సిద్ధం' పోస్టర్ విడుదల కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నాడు రాళ్లబాట - నేడు రాచబాట



నాడు - రాళ్లు రప్పలతో ఉన్న దారి



నేడు - మద్దికెరలో రూపుదిద్దుకున్న సీసీ రోడ్డు

మద్దికెర: మండల కేంద్రం మద్దికెరలో చౌడేశ్వరీ దేవి గుడి నుంచి రాగిమాను కట్ట వరకు రోడ్డు లేక రాళ్లు రప్పలు తేలి అడుగు వేయాలంటే ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఎన్నికల సమయంలో వచ్చిన ప్రతి నాయకుడిని రోడ్డు ఏర్పాటు చేయాలని అడిగినా ఎవరూ పట్టించుకోలేదు. కాలనీ పరిస్థితి ఇంతే అని వదిలేశారు. అయితే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కాలనీలో పర్యటించినపుడు రోడ్డు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు విన్నవించారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో రూ.20 లక్షలు సచివాలయ నిధులు మంజూరు చేయించి సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మృతి చెందిన నరసింహగౌడ్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల గ్రామానికి చెందిన రైతు ఈ.నరసింహగౌడ్ (39) అప్పుల బాధతో ఆదివారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. గ్రామానికి చెందిన ఈ.నరసింహగౌడ్‌కు భార్య రామలక్ష్మి, కుమార్తె లీలావతి, కుమారుడు భరత్ ఉన్నారు. తనకున్న రెండెకరాల పొలంతో పాటు మరో 4 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. పొలం పనులు, ఇంటి కోసం రూ.6 లక్షలకు పైగా అప్పు చేశాడు. పంట నష్టం రావడం, అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో ఆదివారం ఉదయం ఇంట్లో ఇనుప కడ్డీకి తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతసేపటికీ గది నుంచి బయటకు రాకపోవటంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా తాడుకు వేలాడుతూ కనిపించడంతో ఇంటి పక్కల వారు వచ్చి కిందకు దించారు. ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ సీఐ మోహన్ రెడ్డి సాయంత్రం తెలిపారు.